వృద్ధిరేటుకు.. కాంగ్రెస్ కాటు

కేసీఆర్ వేసిన ఆర్థిక పునాదులను నాశనం చేస్తున్న రేవంత్ • కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ఆర్థికం అతలాకుతలం

- జీఎస్డీపీ, తలసరి వృద్ధి రేటులో అట్టడుగున తెలంగాణ
- అస్సాం, మేఘాలయ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల కంటే ఘోరం
- 15 నెలల కాంగ్రెస్ పాలనలో పడిపోయిన గ్రోత్ రేటు
- కేంద్ర ప్రభుత్వ ఎంవోఎస్‌పీఐ నివేదిక ద్వారా సుస్పష్టం
- తెలంగాణ జీఎస్టీ వసూళ్లు 5.1 శాతమే.. మార్చిలో జీరో
- కేంద్ర జీఎస్టీ వృద్ధిరేటులో సగానికి పడిపోయిన తెలంగాణ
- రవాణాశాఖలోనూ అంతకంతకూ తగ్గుతున్న రాబడి.. 15 నెలల వ్యవధిలో రూ.1,203 కోట్లు తగ్గిన వసూళ్లు



జీఎస్డీపీ వృద్ధిరేటు ఇలా.. (ప్రస్తుత ధరలు)

కేసీఆర్ ప్రభుత్వంలో 2023-24	రేవంత్ ప్రభుత్వంలో 2024-25
11.06%	10.12%
15 నెలల్లో పతనం	0.94%

తలసరి వృద్ధిరేటు ఇలా.. (ప్రస్తుత ధరలు)

కేసీఆర్ ప్రభుత్వంలో 2023-24	రేవంత్ ప్రభుత్వంలో 2024-25
14.1%	9.6%
15 నెలల్లో పతనం	-4.5%

ఎంతలో ఎంత తేడా?
ఎట్లుండె తెలంగాణ.. ఎట్లయిపాయే??

పదకొండేండ్ల కింద ఉమ్మడి రాష్ట్రం నుంచి విడిపోయినప్పుడు తెలంగాణ ఆర్థికంగా బలహీనంగా ఉండేది. అయితే తెలంగాణలో సమ్మిళితాభివృద్ధే లక్ష్యంగా అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ పదేండ్ల పాటు శ్రమించి రాష్ట్రానికి బలమైన ఆర్థిక పునాదులు వేశారు. ఆర్థికంగా పసికూనగా ఉన్న రాష్ట్రాన్ని అన్ని విషయాల్లో అగ్రగామిగా నిలబెట్టారు. దాని ఫలితమే జీఎస్డీపీ, తలసరి ఆదాయం, జీఎస్టీ వసూళ్లు, రవాణా రాబడి ఇలా ప్రతి విషయంలోనూ తెలంగాణ దేశంలోనే టాప్ ర్యాంకులో నిలిచింది.

అయితే ఎవరో శాపం పెట్టినట్టు.. ఉన్నట్టుండి పిడుగు పడినట్టు దాదాపు అన్ని ఆర్థిక సూచీల్లో తెలంగాణ అధఃపాతాళానికి దిగజారిపోయింది. జీఎస్డీపీ, తలసరి, జీఎస్టీ వసూళ్లు, రవాణా రాబడి ఇలా ఏ అంశాన్ని విశ్లేషించినా రాష్ట్రం ఇప్పుడు పేలవమైన ప్రదర్శననే కనబర్చింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే తెలంగాణ ఆర్థికం అధోగతి పాలయ్యిందని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇంటిని రక్షించే ఓ స్తంభంలా రాష్ట్రాన్ని కాపాడి తెలంగాణకు కేసీఆర్ వేసిన బలమైన ఆర్థిక పునాదులను రేవంత్ ప్రభుత్వం నాశనం చేసిందని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

హైదరాబాద్, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ)/(స్పెషల్ టాస్క్ బ్యూరో): కేసీఆర్ జమానాలో ఆర్థిక రంగంలో తెలంగాణ కొత్త రికార్డులు సృష్టించింది. తలసరి ఆదాయంలో దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచింది. జీఎస్డీపీ వృద్ధి రేటులో మిగతా రాష్ట్రాలకు దిక్సూచిగా మారింది. అయితే, ఇదంతా గతం. 15 నెలల రేవంత్ పాలనలో తెలంగాణ ఆర్థికం అతలాకుతలమైంది. ఎంతలా అంటే.. అస్సాం, మేఘాలయ, ఛత్తీస్‌గఢ్ వంటి చిన్న రాష్ట్రాలతో పోలిస్తే ఒకప్పటి సిరుల తెలంగాణ ఇప్పుడు ఎంతో వెనుకంజలో నిలబడింది. రేవంత్ పాలనలో జీఎస్డీపీ వృద్ధిరేటు పరంగా తెలంగాణ 14వ స్థానంలో నిలిచింది. అలాగే తలసరి ఆదాయం వృద్ధిరేటులో 11వ స్థానానికి పరిమితమైంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 18 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల వృద్ధి రేట్లపై కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ (ఎంవోఎస్‌పీఐ) తాజాగా విడుదల చేసిన నివేదికలో విస్తుపోయే అంశాలు వెల్లడయ్యాయి.

జీఎస్డీపీ కుదేలు

ఒక రాష్ట్రంలోని మొత్తం పౌరుల ఉత్పాదకతను స్థూలంగా రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (జీఎస్డీపీ)గా పిలుస్తారు. తెలంగాణ ఆవిర్భావమప్పుడు 2014-15లో జీఎస్డీపీ రూ. 5.05 లక్షల కోట్లుగా నమోదైంది. రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగే నాటికి అంటే 2023-24లో జీఎస్డీపీ రూ. 15,01,981కోట్లకు చేరింది. పదేండ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ జీఎస్డీపీ దాదాపు రూ. 10 లక్షల కోట్ల మేర పెరిగింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ తెలంగాణ జీఎస్డీపీ రూ. 16.12 లక్షల కోట్లకు చేరింది. అయితే కేసీఆర్ పాలనతో పోలిస్తే, జీఎస్డీపీ వృద్ధిరేటు రేవంత్ పాలనలో తగ్గుముఖం పట్టినట్టు ఎంవోఎస్‌పీఐ గణాంకాలను బట్టి అర్థమవుతున్నది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో అంటే కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జీఎస్డీపీలో 11.06 శాతం మేర వృద్ధిరేటును నమోదు చేసిన తెలంగాణ.. 2024-25 ఆర్థిక సంవత్సరానికి వచ్చేసరికి 10.12 శాతానికే (ప్రస్తుత ధరలు) పరిమితమైంది. దీంతో జీఎస్డీపీ వృద్ధిరేటులో కేసీఆర్ హయాంలో దేశంలోనే మూడో స్థానంలో ఉన్న తెలంగాణ.. ప్రస్తుతం 14వ స్థానానికి పడిపోయింది. ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న చిన్న రాష్ట్రాలు అస్సాం, మేఘాలయ, ఛత్తీస్‌గఢ్‌తో పోలిస్తే జీఎస్డీపీ వృద్ధి రేటులో తెలంగాణ ర్యాంకు తక్కువగా ఉన్నది. స్థిర ధరల వద్ద కూడా జీఎస్డీపీ వృద్ధి రేటులో (6.79 శాతం) తెలంగాణ 13వ స్థానానికి పరిమితమైంది. ఈ మేరకు ఎంవోఎస్‌పీఐ నివేదిక ద్వారా అర్థమవుతున్నది.

తెలంగాణ జీఎస్డీపీ వృద్ధిరేటు (శాతాల్లో) ఇలా.. (ప్రస్తుత ధరలను బట్టి..)

సంవత్సరం	వృద్ధిరేటు
2014-15	12.02
2015-16	14.24
2016-17	13.92
2017-18	13.93
2018-19	14.32
2019-20	10.81
2020-21	-0.74 (కరోనా కాలం)
2021-22	19.19
2022-23	17.30
2023-24	11.06
2024-25	10.12





తలసిరిలోనూ డీలా

ఏ దేశమైనా, రాష్ట్రమైనా అభివృద్ధి చెందిందని చెప్పేందుకు అక్కడి పౌరుల తలసరి ఆదాయాన్ని ప్రామాణికంగా తీసుకొంటారు. రాష్ట్రంలో సగటున ఒక్కో పౌరుడు సంపాదించే మొత్తాన్ని తలసరి ఆదాయంగా పిలుస్తారు. తలసరి ఆదాయంలో వృద్ధిరేటును ఒక దేశం లేదా రాష్ట్ర అభివృద్ధి వేగానికి నిదర్శనంగా భావించొచ్చు. కేసీఆర్ ప్రభుత్వహయాంలో గడిచిన పదేండ్లలో తెలంగాణ తలసరి ఆదాయంలో రాకెట్ వేగంతో దూసుకుపోయింది. అయితే, తలసరి ఆదాయం విషయంలో కేసీఆర్ హయాంలో నమోదైన రికార్డులు.. రేవంత్ 15 నెలల పాలనలో తగ్గుముఖం పట్టినట్టు ఎంవోఎస్‌పీఐ గణాంకాలను బట్టి అర్థమవుతున్నది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో అంటే కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తలసరి ఆదాయంలో 14.1 శాతం మేర వృద్ధిరేటును నమోదు చేసిన తెలంగాణ.. 2024-25 ఆర్థిక సంవత్సరానికి వచ్చేసరికి 9.6 శాతానికే (ప్రస్తుత ధరలు) పరిమితమైంది. దీంతో తలసరి ఆదాయ వృద్ధిరేటులో కేసీఆర్ హయాంలో దేశంలోనే నంబర్ 1 స్థానంలో నిలిచిన తెలంగాణ.. ప్రస్తుతం 11వ స్థానానికి పడిపోయింది. కల్లోలిత కశ్మీర్, అస్సాం వంటి చిన్న రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ తలసరి వృద్ధి రేటు తక్కువగా ఉండటం గమనార్హం. ఈ మేరకు ఎంవోఎస్‌పీఐ గణాంకాలను బట్టి తెలుస్తున్నది.

ట్రాన్స్‌పోర్ట్‌లో తగ్గిన రెవెన్యూ వసూళ్లు

రాష్ట్ర రవాణాశాఖలో గతంతో పోల్చితే ఈసారి భారీగా వసూళ్లు తగ్గాయి. కరోనా కాలంలో 2020-21 తర్వాత.. మళ్లీ భారీగా తగ్గింది కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే. 2023-2024లో రవాణాశాఖలో రూ.6,690.22 కోట్ల ఆదాయం రాగా.. 2024-25 సంవత్సరానికి కేవలం రూ.5,787.96 కోట్ల ఆదాయం మాత్రమే వచ్చింది. గతంతో పోల్చితే రూ.1,203 కోట్లకు ట్రాన్స్‌పోర్ట్ శాఖలో రెవెన్యూ వసూళ్లు తగ్గాయి. రాష్ట్ర రవాణా శాఖలో లైసెన్స్ ఉన్న డ్రైవర్ల నుంచి పన్నులు వసూలు చేయడం, వాహనాల రిజిస్ట్రేషన్లు, పర్మిట్లు జారీ చేయడం, పన్ను వసూళ్లు చేయడం, వాహనాల ఉల్లంఘనలను నియంత్రించడానికి ఫైన్‌లు వేయడం వంటి వాటితో ఆదాయం భారీగా సమకూరుతుంది. అయితే, తెలంగాణలో 1.72 కోట్ల వాహనాలు రిజిస్టరై ఉండగా.. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రవాణాశాఖ ద్వారా 2025 జనవరి వరకూ రూ.5,787.96 కోట్ల మొత్తాన్ని మాత్రమే వసూలు చేశారు.

2014 నుంచి రవాణా శాఖ ఆదాయం (రూ.కోట్లలో)

సంవత్సరం	రాబడి
2014-15	1854.61
2015-16	2215.19
2016-17	2721.26
2017-18	3228.37
2018-19	3504.88
2019-20	3515.82
2020-21	3228.69
2021-22	3971.38
2022-23	6390.80
2023-24	6990.22
2024-25 (జనవరి)	5787.96

జీఎస్టీలోనూ నేలచూపులే

రాష్ట్ర జీఎస్టీ వసూళ్ల వృద్ధి రేటు మార్చిలో సున్నాకు పడిపోయింది. అవును ఇది నిజం. రాష్ట్ర జీఎస్టీ వసూళ్లు మార్చి నెలలో రూ.5,401 కోట్లుగా నమోదయ్యాయి. నిరుడు మార్చితో పోల్చితే ఒక్క శాతం కూడా పెరుగలేదు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో జీఎస్టీ వసూళ్లలో దేశ సగటు వృద్ధి రేటు 9.9 శాతంగా నమోదైంది. ఇదే సమయంలో రాష్ట్ర జీఎస్టీ వృద్ధి రేటు 5.5 శాతానికే పరిమితమైంది. అంటే కేంద్రం నమోదు చేసిన వృద్ధిరేటులో రాష్ట్ర వృద్ధి రేటు దాదాపు సగంగా నమోదైంది. బీఆర్ఎస్ పాలనలో ప్రతియేటా పెరిగిన జీఎస్టీ రాబడి.. కాంగ్రెస్ పాలనలో స్తంభించిపోయింది. ఈ నెల ఒకటో తేదీన జీఎస్టీ వసూళ్లకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాలు ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్టాంప్, రిజిస్ట్రేషన్ల ఆదాయం పడిపోవడంతోపాటు జీఎస్టీ వసూళ్లలో పెరుగుదల మందగించిందని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. తెలంగాణ ప్రజల చేతుల్లో డబ్బులు లేకపోవడం, క్రయ, విక్రయాల్లో ఎలాంటి పెరుగుదల లేనట్టుగా చెప్తున్నారు.

అబద్ధాలనే వల్లె వేశారు

రాష్ట్ర జీఎస్టీ వసూళ్లపై ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క సైతం అబద్ధాలు చెప్పారు. తాజా బడ్జెట్ సమావేశాల్లో అసెంబ్లీ సాక్షిగా తెలంగాణ రాష్ట్ర జీఎస్టీ వసూళ్ల వృద్ధి రేటు 12.3 శాతంగా ఉన్నదని వెల్లడించారు. రాష్ట్రానికి అంత రాబడి లేదని, జీఎస్టీ వసూళ్ల వృద్ధి రేటు 5.5 శాతానికే పరిమితమవుతుందని బీఆర్ఎస్ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే ఆర్థికశాఖ మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం అధికారికంగా విడుదల చేసిన గణాంకాల్లో తెలంగాణ జీఎస్టీ వృద్ధి రేటు 5.1 శాతం పరిమితం కావడంతో అసెంబ్లీ సాక్షిగా భట్టి అబద్ధాలు చెప్పినట్టు నిరూపితమైంది.

తెలంగాణలో ఐదేండ్లలో మార్చి నెల జీఎస్టీ వసూళ్లు ఇలా..

సంవత్సరం	జీఎస్టీ వసూళ్లు	వృద్ధి శాతం
2019	రూ.3,897 కోట్లు	9 శాతం
2020	రూ.3,563 కోట్లు	-9 శాతం
2021	రూ.4,166 కోట్లు	17 శాతం
2022	రూ.4,242 కోట్లు	2 శాతం
2023	రూ.4,804 కోట్లు	13.25 శాతం
2024	రూ.5,399 కోట్లు	12 శాతం
2025	రూ.5,401 కోట్లు	0 శాతం

తెలంగాణలో జీఎస్టీ వృద్ధి రేటు

గుండు సున్నా

2025 మార్చిలో సున్నా శాతం
ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం
సర్కారు అనాలోచిత నిర్ణయాలతోనే ఈ దుస్థితి
రైతుభరోసా సాయం అందించకపోవడంతో గ్రామాల్లో ఖర్చు సామర్థ్యం తగ్గిపోయింది
మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో జీఎస్టీ వసూళ్ల వృద్ధి రేటు మార్చి నెలలో సున్నా శాతానికి చేరడంపై మాజీ ఆర్థిక మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆందోళన వ్యక్తంచేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా జీఎస్టీ వృద్ధి రేటు పడిపోవడం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. మంగళవారం ఆయన 'ఎక్స్' వేదికగా జీఎస్టీ వృద్ధికి సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాలను ఉటంకిస్తూ ట్వీట్ చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో జీఎస్టీ వృద్ధి రేటు 5.1 శాతానికి పరిమితం కాగా, 2025 మార్చి నాటికి సున్నా శాతంగా ఉన్నట్టు అధికారిక గణాంకాలే వెల్లడిస్తున్నాయని వివరించారు. దేశవ్యాప్తంగా నమోదైన సగటు జీఎస్టీ వృద్ధి రేటు 10%తో పోల్చితే, తెలంగాణ వృద్ధి రేటు చాలా వెనకబడి ఉన్నదని పేర్కొన్నారు. కానీ, జీఎస్టీ వృద్ధి రేటు 12.3%గా ఉన్నట్టు శాసనసభలో ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క పేర్కొనడం శోచనీయమని విమర్శించారు. అధికారిక గణాంకాలను పరిశీలిస్తే, భట్టి వాదన పూర్తిగా అవాస్తవమని తేలిపోయిందని పేర్కొన్నారు. రాష్ట్ర జీఎస్టీ వృద్ధిరేటు తగ్గిపోతున్న విషయాన్ని ఇటీవల జరిగిన బడ్జెట్ సమావేశాల్లోనే ప్రస్తావించానని, రాష్ట్ర జీఎస్టీ వృద్ధి రేటు 5.5%కు పరిమితమవుతుందని హెచ్చరించానని గుర్తుచేశారు. ప్రతిపక్ష హోదాలో తాము ఇచ్చిన సలహాలు, హెచ్చరికలను కాంగ్రెస్ సర్కారు పట్టించుకోలేదని దుయ్యబట్టారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డప్పటి నుంచి కరోనా సమయంలో మినహా మరెప్పుడూ ఇంత తక్కువ జీఎస్టీ వృద్ధి ఎన్నడూ నమోదు కాలేదని స్పష్టంచేశారు. ఇది రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యానికి, నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు.

అనాలోచిత నిర్ణయాలే కారణం

రాష్ట్ర వృద్ధి రేటు క్రమంగా తగ్గడానికి గత 15 నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాలే కారణమని హరీశ్‌రావు విమర్శించారు. క్షేత్రస్థాయిలో సంక్షేమ పథకాల అమలులో లోపాలు, రైతుభరోసా ద్వారా పంట పెట్టుబడి సహాయం అందించకపోవడం, రైతుభరోసా పథకం కింద రూ.12,000 కోట్ల నిధులు విడుదల చేయకపోవడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఖర్చు సామర్థ్యం తగ్గిపోయిందని వివరించారు. హైడ్రా, మూసీ ప్రాజెక్టు వంటి తప్పుడు విధానాలతో భయాందోళనలు సృష్టించి పెట్టుబడులు రాకుండా చేయడం, ఫార్మాసిటీ, మెట్రోరైలు ప్రాజెక్టులను రద్దు చేయడం వల్ల వ్యాపార వాతావరణం దెబ్బతిన్నదని పేర్కొన్నారు. ప్రజల చేతిలో డబ్బు లేకపోతే వినియోగం ఎలా పెరుగుతుందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆర్థిక మంత్రి శాసనసభను మాత్రమే కాదు, తెలంగాణలోని ప్రతి పౌరుడిని మోసం చేశారని, ఇది సిగ్గుచేటని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, మోసపూరిత అంకెల గారడీతో మోసం చేయకుండా, వాస్తవాల ఆధారంగా పాలన అందించాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని హరీశ్‌రావు పేర్కొన్నారు.

వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని మెగా టెక్స్‌టైల్ పార్కులో కిటెక్స్ పరిశ్రమ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న అప్పటి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ (ఫైల్)

వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని మెగా టెక్స్‌టైల్ పార్కులో ఉద్యోగాల కోసం దరఖాస్తులు చేసుకోవడానికి వచ్చిన అభ్యర్థులు

కేసీఆర్ సంకల్పం.. కిటెక్స్ సాకారం

మొదటిపేజీ తరువాయి...

తరలివచ్చి దరఖాస్తులు చేసుకున్నారు. వారి అర్హతను బట్టి కంపెనీ నిర్వాహకులు దరఖాస్తులను స్వీకరించారు. తొలిరోజు 150 మంది అభ్యర్థులు దరఖాస్తులు పెట్టుకున్నట్టు కంపెనీ ప్రతినిధి మనోజ్‌కుమార్ తెలిపారు. కంపెనీలో ఉద్యోగాల ఖాళీలతోపాటు పూర్తి వివరాలు కిటెక్స్ వస్త్ర పరిశ్రమ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

కేసీఆర్ బలమైన పునాది

ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు అనంతరం తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ వేసిన బలమైన పునాది ఫలితాలు ఇప్పుడు కనిపిస్తున్నాయి. కేసీఆర్ దార్శనికత, ముందుచూపుతో రూపుదిద్దుకున్న టీఎస్ఐపాస్ ద్వారా రాష్ట్రానికి వచ్చిన ఆ పరిశ్రమలో ఉత్పత్తి మొదలవుతున్నది. ఈ క్రమంలో ఆ సంస్థ ఏకంగా 25 వేల మందికి ఉద్యోగాలు ఇస్తూ నోటిఫికేషన్ ఇచ్చింది. ఇది ఆశామాషీ విషయం కాదు. ఇంత పెద్ద ఎత్తున తెలంగాణ నిరుద్యోగులకు కేసీఆర్ దార్శనికత, కేటీఆర్ చొరవతో ఉద్యోగావకాశాలు ఏర్పడ్డాయన్నమాట.

ప్రగతికి బాటలేసిన బీఆర్ఎస్ సర్కారు

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో పెద్ద ఎత్తున పారిశ్రామికవాడలను ఏర్పాటు చేయడమే కాకుండా పెట్టుబడులను కూడా భారీగా రాబట్టేందుకు ఆనాడు చర్యలు చేపట్టింది. ముఖ్యంగా అప్పటి మంత్రి కేటీఆర్ దేశ, విదేశాలకు చెందిన కంపెనీలతో నిత్యం సంప్రదింపులు జరుపుతూ రాష్ట్రానికి సాధ్యమైనన్ని ఎక్కువ కంపెనీలు వచ్చేలా విశేష కృషిచేశారు. పెట్టుబడులకు తెలంగాణను గమ్యస్థానంగా మార్చారు. దీంతో పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణలో వేలాది పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. ఇందులో కిటెక్స్ కంపెనీ ఒకటి. ఇది ప్రపంచంలో అతి పెద్ద దుస్తుల పరిశ్రమల్లో ఒకటి. రోజుకు 35 లక్షల దుస్తుల తయారీ సామర్థ్యం గల ఈ పరిశ్రమ వరంగల్‌తోపాటు రంగారెడ్డి జిల్లా సీతారాంపూర్‌లో పరిశ్రమలను ఏర్పాటు చేస్తున్నది. ఇందులో వరంగల్‌లో ఏర్పాటుచేసిన పరిశ్రమ ఉత్పత్తికి సిద్ధం కావడంతో ఇటీవల ఆ సంస్థ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది.

25 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ

కిటెక్స్ సంస్థలో పనిచేసేందుకు వివిధ క్యాటగిరీలకు చెందిన 25 వేల ఉద్యోగాల భర్తీకి ఒకేసారి నోటిఫికేషన్ ఇవ్వడం గమనార్హం. వైస్ ప్రెసిడెంట్లు, జనరల్ మేనేజర్లు, మేనేజర్లు, సహాయ మేనేజర్లు, ఇంజినీర్లు (సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్), ఇన్‌చార్జులు, జిన్నింగ్, బ్లీచింగ్, డైయింగ్, ప్రింటింగ్, కటింగ్, ఎంబ్రాయిడరీ, పవర్‌స్టేషన్, ఫైనాన్స్, ఐటీ, సోర్సింగ్, ఎగుమతి, దిగుమతి, హెచ్ఆర్, ఫైర్‌సేఫ్టీ, బాయిలర్, ఎస్‌టీపీ తదితర విభాగాల్లో ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్టు కంపెనీ వర్గాలు తెలిపాయి. ఉద్యోగుల్లో 80 శాతం మహిళలే ఉంటారని ఇదివరకే కంపెనీ ప్రకటించింది. ముడి పత్తిని ప్రాసెస్ చేయడం, జిన్నింగ్, స్పిన్నింగ్ నుంచి దుస్తులు తయారయ్యే వరకు అన్నిరకాల ప్రక్రియలు ఇక్కడే జరగడం కిటెక్స్ కంపెనీ ప్రత్యేకత. జిన్నింగ్, స్పిన్నింగ్, నిట్టింగ్, బ్లీచింగ్, డైయింగ్, ప్రింటింగ్ తదితర అన్ని పనులూ నిర్వహించే విధంగా అత్యాధునిక పరిశ్రమను ఏర్పాటుచేశారు.

మూడింతలు పెరిగిన కిటెక్స్ పెట్టుబడి

కేటీఆర్‌తో భేటీ అయిన గంటలోనే వరంగల్ రూ.1,000 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు కిటెక్స్ కంపెనీ ముందుకొచ్చింది. అనంతరం ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహకాలు, రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న నాణ్యమైన పత్తి, నైపుణ్యంగల కార్మికులు తదితర అనుకూలతలతో సీతారాంపూర్, వరంగల్‌లో కలిపి రూ.2,400కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ఒప్పందం చేసుకున్నారు. ఆ తరువాత తమ పెట్టుబడిని మరో రూ.600 కోట్లకు పెంచుతూ మొత్తం రూ.3,000 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నారు. ప్రభుత్వం సైతం కిటెక్స్‌కు వారి అవసరాలకు తగ్గట్టుగా వరంగల్‌లో 185, సీతారాంపూర్‌లో 250 ఎకరాలను కేటాయించింది. విద్యుత్తు, నీటి సరఫరాకు ప్రత్యేక లైన్లను ఏర్పాటు చేయడంతోపాటు రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలను ప్రభుత్వమే కల్పించింది.

ఫలించిన కేటీఆర్ చాణక్యం

కొచ్చిలో రూ.3,500 కోట్ల మెగా ప్రాజక్టును స్థాపించేందుకు కిటెక్స్ సంస్థ 2020 జనవరిలో కేరళ ప్రభుత్వంతో ఎంవోయూ చేసుకున్నది. అయితే అక్కడి వామపక్ష సర్కారుతో విభేదాలు రావడంతో పెట్టుబడిని ఇతర రాష్ట్రాలకు తరలిస్తామని 2021 జూలైలో కంపెనీ చైర్మన్ జాకబ్ ప్రకటించారు. దీంతో కర్ణాటక, ఏపీ, తమిళనాడు సహా 10 రాష్ట్రాలు, శ్రీలంక దేశం కూడా కిటెక్స్ కంపెనీకి ఆహ్వానం పలికాయి. ఇదే సమయంలో కేటీఆర్ ప్రత్యేక చొరవ తీసుకొని, కంపెనీ చైర్మన్ జాకబ్‌తో మాట్లాడారు. తెలంగాణ పెట్టుబడులకు గమ్యస్థానం ఎందుకో ఆయనకు వివరించి చెప్పారు. స్వయంగా ఒక్కసారి ఇక్కడికి వచ్చి చూడాలని, నచ్చితేనే తదుపరి ముందుకు సాగవచ్చని సూచించారు. కొవిడ్ ఇబ్బందుల కారణంగా, తెలంగాణ ప్రభుత్వమే ప్రత్యేక విమానాన్ని కొచ్చికి పంపడంతో కిటెక్స్ ఎండీ సాబూ ఎం జాకబ్ సహా వారి బృందాన్ని హైదరాబాద్‌కు వచ్చారు. ఇక్కడినుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో వరంగల్‌లోని కేఎంటీపీకి తీసుకెళ్లి వారికి భూములను చూపారు. ఆ మరుసటిరోజు రంగారెడ్డి జిల్లా సీతారాంపూర్‌లో మరో స్థలాన్ని చూపించారు. రాష్ట్ర ప్రభుత్వ చొరవను, కేసీఆర్ నాయకత్వం, మంత్రి కేటీఆర్ స్నేహపూర్వక వైఖరికి ముగ్ధుడైన జాకబ్ రాష్ట్రంలో భారీ పెట్టుబడులు పెట్టాలని ఆనాడే నిర్ణయించుకున్నారు.

అవార్డుతో ఎంఎల్ఆర్ఐటీ విద్యార్థులు

జాతీయస్థాయిలో ఎంఎల్ ఆర్ఐటీ ప్రతిభ

దుండిగల్, ఏప్రిల్ 8: దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్ రెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (ఎంఎల్ఆర్ఐటీ) కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ఢిల్లీలో మంగళవారం జరిగిన థింగ్ కు బెటర్ కో హోర్ట్ 7 పేరిట జరిగిన జాతీయ సదస్సులో పాల్గొని 10 జట్లలో ఒకటిగా ఎంఎల్ఆర్ఐటీ నిలిచింది. నాస్కామ్ ఫౌండేషన్, తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) సహకారంతో కళాశాలకు చెందిన సాయి తరుణ్ పసుమర్తి, నిరంజన్ విక్రమ్‌సింగ్